## క్లుప్తంగా

### జిల్లా కోర్టులో ఈ-సేవా కేంద్రం



ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన న్యాయపరమైన సమాచారం ఈ సేవా కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చని, కక్షిదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల్లో ఉచిత న్యాయ సహాయం తదితర న్యాయ సేవా సదుపాయాలు ఇక్కడ తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యపరెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### టీబీ నివారణకు సహకరించాలి



నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీ నివారణకు ప్రైవేటు డాక్టర్లు కూడా సహకరించాలని జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. బీవీనగర్‌లోని శారదా ఆస్పత్రి, కిరణ్ హాస్పిటల్, శ్రీహరి నగర్‌లోని ప్రైన్ ఆస్పత్రులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయా ఆస్పత్రుల డాక్టర్లతో ఖాదర్‌వలీ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలున్న రోగులు వస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేటు మిక్స్ కో-ఆర్డినేటర్ హరీస్, భవ్య సంస్థ కో-ఆర్డినేటర్ తులసీరామ్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

### కాకాణితో నేదురుమల్లి భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు.

### నిర్లక్ష్యాన్ని వీడండి

• డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



నెల్లూరు(పొగతోట): నిర్లక్ష్యాన్ని వీడి లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఏపీఎంలకు సూచించారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వివిధ మండలాల ఏపీఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శనివారం ఆమె మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల లక్ష్యాలను సాధించాలన్నారు. బ్యాంకర్లతో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై మహిళలందరికీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పొదుపు మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న బ్యాంకు లింకేజ్ రుణాలు యాప్ ద్వారా తిరిగి చెల్లించాలన్నారు. వారంలోపు లక్ష్యాల్లో 85 శాతం సాధించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

### నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సందడిగా మట్టి గణపతి నిమజ్జనోత్సవం

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు నేతాజీ నగర్ 8వ వీధిలో (అనూరాధ అపార్ట్‌మెంట్) తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మహాగణపతి మట్టి విగ్రహ నిమజ్జనోత్సవం శనివారం సందడిగా నిర్వహించారు. నేతాజీనగర్ మిత్రమండలి ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం కోసం 108 మంది మహిళలు కలశాలలో పవిత్ర పినాకిని జలాన్ని నేతాజీనగర్ 8వ వీధి నుంచి ప్రదర్శనగా నగరోత్సవం చేపట్టారు. పొదలకూరు రోడ్డు వాటర్ ట్యాంక్, పద్మావతి సెంటర్ మీదుగా రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు.. అలాగే కరెంటాఫీస్‌సెంటర్ మీదుగా నిప్పోసెంటర్ మీదుగా నేతాజీనగర్ చేరారు. పవిత్ర జలంతో మట్టి గణపతిని అభిషేకించి అక్కడే నిమజ్జనం నిర్వహించారు. తదుపరి అదే ప్రాంగణంలో ప్రతిష్టించిన గణనాథుని ప్రతిమను ప్రత్యేక వాహనంపై గణేష్‌ఘాట్ వద్ద రాత్రి నిమజ్జనం చేశారు. సుమారు వెయ్యిమందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వామివారి చెంత ఉంచిన లడ్డూను రూ.45 వేలుకు ఓ భక్తుడు దక్కించుకున్నారు. మిత్రమండలి సభ్యులు పోతినేని రాజశేఖర్, మనోజ్, ఎం.జీవన్, బాలాజీ, జశ్వంత్, తేజ, డి.సాకేత్, జె.ప్రశాంత్, రాఘవ తదితరులు పర్యవేక్షించారు.



పినాకిని జల కలశాలతో మహిళల నగరోత్సవం



మట్టి గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

## చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంట రాజేంద్రనగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదం పంపిణీని ప్రారంభించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, స్థానిక నేతలు శేషయ్య, గోపి, శంకర్, ఇందిర, లక్ష్మి, మాధవి, నాగమణి, శివ పాల్గొన్నారు.

• గుర్రాలమడుగు సంఘం మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన వరసిద్ధి వినాయక చవితి మహోత్సవంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి పాల్గొన్నారు. 16వ డివిజన్ ఇన్‌చార్జి సగిలి జయరామిరెడ్డి, స్థానిక నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణ, సాంబ, నాగలక్ష్మి, మస్తాన్, నరేంద్ర, పవన్, రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, షరీఫ్, పార్థసారథి, సుకుమార్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



## కోలాహలంగా..

నెల్లూరు(అర్బన్): 25వ డివిజన్ బుజబుజనెల్లూరు శ్రీరామ్‌నగర్ పదో వీధిలో యువత ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. నాలుగో రోజు శనివారం రాత్రి చిన్నపిల్లల డ్యాన్సులు, పాటలు, కోలాటం అలరించాయి. నిర్వాహకులు నిరంజన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, కోటయ్య, లక్ష్మి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుతో ఎంతో అనుబంధం

నెల్లూరురూరల్: మాది కర్నూలు జిల్లా అయినా నెల్లూరుతో ఎక్కువ అనుబంధం ఉందని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్వో పదవీ విరమణ సందర్భంగా శనివారం ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ హాజరై, ఆయన సేవలను కొనియాడారు. తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా, డీఆర్వోగా మంచి సేవలు అందించారని తెలిపారు. అనంతరం డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ తనకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధి అల్లంపాటి పెంచల్‌రెడ్డి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు



డీఆర్వో దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ

# అనధికార నిర్మాణాలపై ఎందుకీ మౌనం?

• టౌన్ ప్లానింగ్ అధికారులపై మండిపడిన మేయర్

నెల్లూరు(బారకాసు): అనధికార నిర్మాణాలపై ఎందుకంత ప్రేమ? నెల రోజులుగా నిర్మాణం జరుగుతుంటే మౌనంగా ఎందుకు ఉన్నారు? చర్యలు తీసుకోకపోవడానికి కారణాలేమిటి? అని టౌన్ ప్లానింగ్ అధికారులపై మేయర్ స్రవంతి మండిపడ్డారు. స్థానిక ట్రంకు రోడ్డులో గతంలో కనకమహల్ సినిమా థియేటర్ ఉన్న ప్రదేశంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలంలో ఎలాంటి అనుమతుల్లేకుండా నూతనంగా నిర్మిస్తున్న అనధికార కట్టడాన్ని మేయర్ గుర్తించి, అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ ఎన్ఎంసీ నుంచి అనుమతి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడుతున్నా ఎందుకు కళ్లు మూసుకుని ఉన్నారంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. తాను చెప్పేంత వరకు కూడా తెలుసుకోలేనంతగా ఉన్నారంటే ఏం చేస్తున్నట్టు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీ రఘునాథ్, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



అనధికార నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మేయర్, అధికారులు

# నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక 34వ డివిజన్ జేవీఆర్ కాలనీ ప్రాంతంలో శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలో డ్రైయినేజీ కాలువలతో తాగునీరు కలిసి కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్నులతో పాటు తాగునీటి కుళాయి పన్నులను విధిగా వసూలు చేయాలన్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అపరిశుభ్రంగా ఉన్న ప్రైవేటు స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనుమతుల్లేని నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించి తొలిదశలోనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ట్రంకు రోడ్డు ఎంబీబీ మాల్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి వరకు జరుగుతున్న కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జేవీఆర్ కాలనీలో స్థానిక ప్రజలకు పలు సూచనలు చేస్తున్న కమిషనర్

# ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కాన్ఫరెన్స్ విభాగం నుంచి కమిషనర్ నందన్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు పలు సూచనలు చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పన్నులపై క్షేత్రస్థాయిలో పర్యటించి వసూలు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్ఓ వాసుబాబు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



# గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్

నెల్లూరు(అర్బన్): మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు తక్షణమే కూటమి ప్రభుత్వం చెల్లించాలని మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆవాజ్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రషీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘానికి చెందిన పలువురు నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ దైవభక్తితో ఆదాయం తక్కువగా ఉన్న మసీదుల్లో కేవలం నమాజును మాత్రమే చదివించుకుంటూ అనేక మంది ఇమామ్‌లు, మౌజన్‌లు బతుకు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వీరు ఎలాంటి ఇతర వృత్తులు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రతినెలా గౌరవ వేతనం ఇమామ్‌లు, మౌజన్‌లకు అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక గత 15 నెలల కాలంలో ఒక సారి మాత్రమే ఆరు నెలల గౌరవ వేతనాన్ని చెల్లించారన్నారు. తర్వాత 9 నెలలుగా ఇవ్వలేదన్నారు. అందువల్ల పెండింగ్ గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు చాన్‌బాషా, రియాజ్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న ఆవాజ్ కమిటీ నేతలు

### బంగారు ఆభరణాల బహూకరణ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కొలువైన అమ్మవార్లకు ఆనం వెంకటరమణారెడ్డి, మిత్రబృందం రెండు బంగారు చైన్లు, రెండు తాళిబొట్లు(మంగళ సూత్రాలు) శనివారం బహూకరించారు. వీటిని దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వీటి విలువ రూ.4 లక్షలుగా ఉంటాయన్నారు.

### 2న దివ్యాంగ విద్యార్థులకు వైద్య శిబిరం

నెల్లూరు (టౌన్): నగరంలో దివ్యాంగ విద్యార్థుల కోసం వచ్చేనెల 2న వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అర్బన్ ఎంఈఓ తిరుపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రంగనాయకులపేటలోని పీఎన్నార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ ఆవరణలో మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. నగర పరిధిలో 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షించి తగిన ఉప కరణాల కోసం సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు.

### 'సిద్ధ సమాధి సమారోహం' నేడు



నెల్లూరు(బృందావనం): గీతా వైభవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 'సిద్ధ సమాధి సమారోహం' ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్, గీతా ప్రబోధక్ నజీర్‌బాషా గురాజీ తెలిపారు. మూలాపేట శివగిరి కాలనీలోని ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు రంగనాయకులపేటలోని ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చెంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. నిర్వాహకులు బండారు రాజశ్రీ, గుర్రం లక్ష్మీప్రసన్న, పెంచలనాయుడు, విజిత, గుమ్మా లీలావతి, పి.మల్లీశ్వరి, టి.సబిత, బి.సుభాషిణి, బి.అమరావతి పాల్గొన్నారు.

### కల్యాణి, పూజితకు సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కాకాణి పూజితలను మహిళా నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

### అభివృద్ధి పనుల ప్రారంభం

నెల్లూరు సిటీ: 15వ డివిజన్‌లోని రౌండ్ తూము వద్ద రోడ్డును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం ప్రారంభించారు. అలాగే గాంధీబొమ్మ సెంటర్‌లోని స్వతంత్ర పార్కులో అధునాతన టెక్నాలజీతో రూపొందించిన కంటైనర్ సబ్‌స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఇది పూర్తిగా రిమోట్ ఆధారిత సబ్‌స్టేషన్ అని తెలిపారు.

• ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పప్పులవీధి వరకు ర్యాలీ నిర్వహించారు.

# అనుమతులను సులభతరం చేయాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాల అనుమతుల మంజూరు ప్రక్రియను సులభతరం చేయాలని వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులకు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) విద్యుల్లత సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీపీ మాట్లాడుతూ నగరంలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు సంబంధించి, ప్లాన్ అనుమతుల గురించి వార్డు పరిధిలో అవగాహన కల్పించాలన్నారు. లాగిన్‌లో ఎలాంటి ఫైళ్లు పెండింగ్లో ఉంచుకోకుండా షార్ట్ ఫాల్స్‌ను క్లియర్ చేసేందుకు సంబంధిత నిర్మాణదారులతో సంప్రదించి అనుమతుల మంజూరు ప్రక్రియను సులభతరం చేయాలన్నారు. అనంతరం కమిషనర్ నందన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా సచివాలయ పరిధిలో పర్యటించి నూతన నిర్మాణాలను గుర్తించాలన్నారు. అడిషనల్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లు వరప్రసాద్, శ్రీనివాసులు, సీపీ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీసీపీ విద్యుల్లత

# నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): కల్తీ, నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ కార్తీక్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి నమోదు చేసిన వివిధ కేసులను విచారించారు. పది మంది వ్యాపారస్తులకు మొత్తం రూ.3.80 లక్షల జరిమానా విధించామన్నారు. ఆహార పదార్థాలు విక్రయించేవారు, తయారీదారులు, సరఫరా చేసేవారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణుతి ఫ్లోరా, నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకతకు స్త్రీనిధి యాప్


• ఏజీఎం కామక్షయ్య

నెల్లూరు(పొగతోట): స్త్రీనిధి రుణాలను తిరిగి చెల్లించే ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టేందుకు స్త్రీనిధి రికవరీ యాప్‌ను తీసుకొచ్చినట్లు స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉద్యోగులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏజీఎం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక గ్రూపు మహిళలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రుణాలు తిరిగి చెల్లించే సమయంలో ఉద్యోగులపై పనిభారం, సమయం వృథా కావడం, పారదర్శకత లేకుండా ఉంటోందన్నారు. ఇటువంటి వాటిని తొలగించేందుకు స్త్రీనిధి రికవరీ యాప్‌ను తీసుకొచ్చామన్నారు. స్త్రీనిధి రుణాలు చెల్లించే మహిళలు వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ యాప్ ద్వారా చెల్లించాలన్నారు. దీనిపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300ల కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ.83 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు.



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య

# ఆత్మీయ సన్మానం




శ్రీనివాసులును సన్మానిస్తున్న డాక్టర్లు



ప్రసాద్‌ఆచారి దంపతులను సన్మానిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగంలో ల్యాబ్ సహాయకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న కమ్మటి శ్రీనివాసులు ఆత్మీయ సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకుపైగా ఉద్యోగ జీవితంలో శ్రీనివాసులు నిబద్ధత, అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. మరోవైపు యూనియన్ నేతగా సాటి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన శేషజీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు ఉద్యోగులు, డాక్టర్లు శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సంఘమిత్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్, పుల్లయ్య, కీర్తితేజ సిబ్బంది పాల్గొన్నారు.

• జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కుష్టు, ఎయిడ్స్, టీబీ విభాగంలో డీపీఎంఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్వీఏ ప్రసాద్‌ఆచారిని ఆ శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో సన్మాన సభ శనివారం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పాల్గొని, మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ప్రసాద్‌ఆచారి దంపతులను సన్మానించారు. డీఎస్ఎం సురేంద్రబాబు, ఎన్ఆర్‌హెచ్ఎం ప్రాజెక్టు మేనేజర్ రమేష్, డీఎంఓ హుస్సేనమ్మ, ఏపీజీఏ జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ రమణారెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో న్యాయమూర్తులు

• నెల్లూరు (లీగల్): న్యాయశాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేస్తున్న గౌరున్నిసా, నజీమున్నిసా, ఆర్.ప్రేమ్‌కుమార్ సన్మాన కార్యక్రమం శనివారం జరిగింది. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పాల్గొని, వారి సేవలను కొనియాడారు.

# కారుణ్య నియామక పత్రాల అందజేత

నెల్లూరురూరల్: సాంఘిక సంక్షేమ శాఖలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తూ శీనయ్య మృతిచెందడంతో ఆయన కుమారుడు దినేష్‌బాబును ట్రెజరీ శాఖలో ఆఫీస్ సబార్డినేటర్‌గా నియమించారు. అలాగే ఏపీఎస్ఆర్టీసీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ సురేష్ బాబు మృతిచెందగా, ఆయన భార్యకు పోలీస్ శాఖలో స్వీపర్‌గా నియమించారు. వీరికి డీఆర్వో హుస్సేన్ సాహెబ్ చేతుల మీదుగా శనివారం నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న డీఆర్వో